క్లుప్తంగా

నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు



తాడికొండ: తాడికొండ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త మేక తోటి సుచరిత క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు పుట్టిన రోజు పండుగ క్రిస్మస్ ప్రపంచ వ్యాప్తంగా కులమతాలకు అతీతంగా అందరూ జరుపుకొనే అతిపెద్ద పండుగ అన్నారు. క్రీస్తు జననం శుభసూచకానికి సంకేతమని, మానవులను పాపం నుంచి రక్షించేందుకు కన్యమరియ గర్భాన మనుష్య రూపంలో జన్మించిన ఏసుక్రీస్తు జీవితం సందేశాత్మకం అన్నారు.

ముగిసిన లక్ష తమలార్చన



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి, సీతానగరం వద్ద గల చెట్టు కింద ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం లక్ష తమలార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏకాదశి, ద్వాదశి పర్వదినాలలో ప్రభాత ఆంజనేయస్వామి వారికి లక్ష తమల పాకులతో పూజా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని, బుధవారం స్వామివారి పూజా కార్యక్రమాల అనంతరం లక్ష తమలపాకులను కృష్ణానదిలో నిమజ్జనం చేస్తామని తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

చిన్నారులకు నేత్ర వైద్యపరీక్షలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్, నవ జీవన్ బాలభవన్ చిగురు బాలల ఆశ్రమంలో ఆదివారం బాలల కోసం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నేత్ర వైద్యులు డాక్టర్ ప్రియా చైతన్య మాట్లాడుతూ బాలలు అందరూ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. కనురెప్పలు అదరటం సాధారణంగా జరుగుతుందని, అయితే కళ్లలో నలత లేదా ఇన్‌ఫెక్షన్ కారణంగా కళ్లు రంగు మారి ఎక్కువ కాలం అలాగే ఉంటే నేత్ర వైద్యులను సంప్రదించాలని సూచించారు. తలనొప్పి, కంటినొప్పి, కళ్లు ఎర్రబడడం, చూపు మందగించడం, కంటి నుంచి నీరు కారడం వంటి సమస్యలు ఉన్న చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నేత్ర వైద్యులు ప్రియా చైతన్యకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ఇన్‌ఛార్జి జోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ వద్ద వున్న పోలీస్ అవుట్‌పోస్ట్ వద్ద పాత జాతీయ రహదారిపై కొండచిలువ ఆదివారం తెల్లవారుజామున ఎటు వెళ్లాలో తెలియక రోడ్డుపై తిరుగుతూ ద్విచక్రవాహనాలపై వెళ్లేవారిని భయభ్రాంతులకు గురిచేసింది. కొంతసేపు రోడ్డుపై అలాగే కదలకుండా ఉండడంతో కొంతమంది యువకులు రాళ్లతో కొండచిలువను చంపేశారు. కొండచిలువ రోడ్డుపై అలా ఉండడంతో వాహన చోదకులు దానిని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఆ కొండచిలువను అక్కడి నుంచి తీసి కృష్ణానదిలోకి విసిరి వేశారు.

డాక్టర్ వుళ్లక్కికి ఘన నివాళి



తెనాలి రూరల్: తెనాలి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, మేజర్ కాకుమాను వుళ్ళక్కి వర్ధంతిని తెనాలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బోసు రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పేద ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి శాఖ అధ్యక్షురాలు డాక్టర్ జె. విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, వైద్యులు గోగినేని లక్ష్మీప్రసాద్, డాక్టర్ విశ్వమోహన రావు, డాక్టర్ వి. శేషగిరిరావు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ జేవీ సుబ్బారావు పాల్గొన్నారు.



తాడేపల్లి 1వ వార్డులో విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆర్‌సీఎం రక్షకుని మాత ఆలయం



తాడేపల్లిలో విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చి



విద్యుత్ దీపాల వెలుగుల్లో నిడుముక్కల పరిశుద్ధ యోహాను లూథరన్ దేవాలయం

అంతటా క్రిస్మస్ శోభ

క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లోని చర్చిలను, ప్రార్థనా మందిరాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలు చర్చిలు విద్యుత్ దీపాల కాంతులతో వెలుగులు విరజిమ్మాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి చర్చిలలో ప్రార్థనలు ప్రారంభం అవుతాయని పలువురు పాస్టర్లు తెలియజేశారు.

– తాడేపల్లిరూరల్, తాడికొండ



మోతడకలో నూతన శోభను సంతరించుకున్న చర్చి



తాడికొండలో అందంగా అలంకరించిన క్రీస్తు కృపాలయం చర్చి

ఆడుదాం ఆంధ్రాకు సర్వం సిద్ధం

ఆట స్థలాలను సిద్ధం చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు గ్రామ స్థాయిలో, వార్డుస్థాయిలో వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 12 ఆట స్థలాలను కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్ కుమార్, డీఈ కృష్ణారెడ్డిలు ఎంపిక చేశారు. ఆట స్థలాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని 65 సచివాలయాలు ఉండగా ఇప్పటికే పలువురు క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. కార్పొరేషన్ పరిధిలో 65 సచివాలయాలకు సంబంధించి ఎక్కడెక్కడ ఎవరెవరు ఆటల పోటీల్లో పాల్గొనాలో కమిషనర్ నిర్మల్ కుమార్ ఆదివారం వివరాలు వెల్లడించారు.

- సీకే హైస్కూల్ గ్రౌండ్‌లో మంగళగిరి పట్టణ పరిధిలోని బాప్టిస్ట్ పేట, బ్యాంక్ కాలనీ, ఇస్లాంపేట, మార్కండేయ కాలనీ, వెజిటబుల్ మార్కెట్, షరాఫ్ బజార్, టిప్పర్ల బజార్ 1,2, ఎన్‌సీసీ రోడ్డు క్రీడాకారులు



ఉండవల్లి దేవదాయ శాఖ స్థలంలో గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

- డాన్ బాస్కో స్కూల్‌లో భగత్‌సింగ్ నగర్, బాపనయ్య నగర్, కొత్తపేట, నవులూరు 1,2,3 క్రీడాకారులు
- నిర్మల హైస్కూల్ గ్రౌండ్‌లో ద్వారకా నగర్, గండాలయ్య పేట, ఇందిర నగర్, కొప్పురావూరు కాలనీ, లాల్ బహదూర్ కాలనీ, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీ, సూర్యనారాయణ నగర్, వీవర్స్ కాలనీ, ఆత్మకూరు 1,2 ప్రాంతాల క్రీడాకారులు
- చినకాకానిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చినకాకాని 1,2, కాజా 1,2 ప్రాంతాల్లోని వారు
- నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతక్కి 1,2, చిర్రావూరు ప్రాంతాలవారు
- పెదవడ్లపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో – పెదవడ్లపూడి 1,3 ఏరియాల వారు
- పెదవడ్లపూడి క్రిస్టియన్ ఆర్‌సీఎం పాఠశాల ఆవరణలో పెదవడ్లపూడి 2 వారికి
- పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేతపూడి, నిడమర్రు 1, 2, ఎర్రబాలెం 1,2,3, పెనుమాక 1,2 ప్రాంతాలలోని క్రీడాకారులు
- గుడ్ న్యూస్ హైస్కూల్ ప్లే గ్రౌండ్‌లో ఆంధ్రరత్న కట్ట, మహానాడు 1,2, నవోదయ కాలనీ, రాజరాజేశ్వరినగర్, కుంచనపల్లి, ప్రాతూరు ప్రాంతాల్లోని క్రీడాకారులు
- కేసీడబ్ల్యూఈఈఎస్ హైస్కూల్‌లో వడ్డేశ్వరం, బ్రహ్మానందపురం, డోలాస్‌నగర్, డ్రైవర్స్ కాలనీ, నులకపేట, సాయిదుర్గా పురం, ఇప్పటం, కొలనుకొండ ప్రాంతాల్లో నమోదు చేసుకున్న క్రీడాకారులు
- ఉండవల్లి దేవదాయ శాఖకు చెందిన మైదానంలో కొత్తూరు, పద్మశాలీ బజార్, సలాం సెంటర్, సీతానగరం, ఉండవల్లి సెంటర్, ఉండవల్లి 1,2, ప్రాంతాలోని క్రీడాకారులకు పోటీలు జరుగుతాయన్నారు.

శిశు మందిరలో రామానుజన్ జయంతి

తెనాలిఅర్బన్: శ్రీనివాసా రామానుజన్ జయంతిని సరస్వతీ శిశు మందిర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు వై.చింతయ్య మాట్లాడుతూ రామానుజన్ తమిళనాడులో జన్మించి గణితంలో మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారని చెప్పారు. గణితంలోని అనేక చిక్కుముళ్ళను విప్పారని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, కోడూరు మల్లికార్జునరావు, యర్రంశెట్టి హనుమంతరావు పాల్గొన్నారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



తెనాలిఅర్బన్: ఏపీ ఇరిగేషన్, ఆర్అండ్ బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ మెయింటెనెన్స్ అండ్ ప్రాజెక్టు ఎస్టాబ్లిష్‌మెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అమరావతి ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను ఏపీజేఏసీ రాష్ట్ర నాయకుడు బండి శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు ఆవిష్కరించారు. తెనాలిలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు వి.గణేష్, సత్యనారాయణ, ఆర్‌వీ రాఘవయ్య పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ



మొక్కలు నాటుతున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: మొక్కల పెంపకంపైనే మానవుని మనుగడ ఆధారపడి ఉందని కేఎల్‌యూ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్ అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని కాజా గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని, మొక్కల పెంపకంపైనే పర్యావరణ సమతుల్యత ఆధారపడి ఉంటుందని అన్నారు. డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ కళాశాల విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ బాసిత్, డాక్టర్ బీవీఎస్ కిరణ్‌లు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లను, కార్యక్రమ నిర్వాహకులను వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అడ్వైజర్స్ డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం కో–ఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డిలు అభినందించారు.

చిరస్మరణీయుడు మోదుకూరి జాన్సన్



నివాళులర్పిస్తున్న గుంటూరు కృష్ణ, అభిమానులు

తెనాలి: సుప్రసిద్ధ నాటక, సినీ రచయిత మోదుకూరి జాన్సన్ 35వ వర్ధంతిని ఆదివారం స్థానిక గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. మోదుకూరి జాన్సన్ కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటూరు కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాన్సన్ అభిమానులు పలువురు పాల్గొని, ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. నాటి సామాజిక పరిస్థితులపై ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా జాన్సన్ చేసిన రచనలు నేటికీ ప్రాచుర్యంలో ఉన్నాయని గుంటూరు కృష్ణ చెప్పారు.

ఉపాధ్యాయుడు కనపర్తి బెన్‌హర్‌బాబు మాట్లాడుతూ నాటక రంగంలో నిచ్చెన మెట్లు, నటనాలయం, దేవాలయం, సినీ రంగంలో మానవుడు–దానవుడు, డబ్బుకులోకం దాసోహం, కరుణామయుడు సినిమాలు జాన్సన్ రచనా పటిమకు నిదర్శనమన్నారు. సమాజ మార్పును కాంక్షిస్తూ జాన్సన్ రచనలు చేశారన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి పినపాటి రవికుమార్, సహజ కవి అయినాల మల్లేశ్వరరావు, సుంకర విశ్వేశ్వర రావు, కేవీఎస్‌వీ ప్రసాద్, కొమ్ము అబ్రహాం లింకన్, చిలకా సుధాకర్‌బాబు, వైఎంసీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డి.అమర్‌నాథ్, కె.ఆంజనేయులు, పి.శివకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక జీవనశైలితోనే గుండె జబ్బులు



డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ బాధ్యులు

తెనాలి: ఆధునిక జీవనశైలి మనిషి గుండెపై పలు దుష్ప్రభావాలు చూపుతోందని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగిన సభకు క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. 'గుండె జబ్బులు–కారణాలు' అనే అంశంపై డాక్టర్ శ్రీనివాసరెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. భారతదేశంలో దైనందిన జీవనంలో పెరిగిన వేగం, వివిధ వృత్తుల్లోని పోటీతో మానసిక ప్రశాంతత లోపిస్తోందని తెలిపారు. ఆదుర్దా, ఆందోళనలు గుండెపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ప్రతిరోజూ వ్యాయామం చేయటం, జీవన శైలిని మార్చుకోవటంతో గుండెజబ్బుల నుంచి నివారణ పొందవచ్చని సూచించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి తొలుత డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సభకు పరిచయం చేశారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరించారు. కోశాధికారి సీహెచ్ అశోక్‌కుమార్ స్వాగతం పలికారు.

దూరవిద్యతో విద్యావంతులుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: దూరవిద్యతో విద్యావంతులుగా ఎదగాలని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షల విభాగ డైరెక్టర్ నాగేశ్వరరావు సూచించారు. పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో దూరవిద్య టెన్త్ విద్యార్థుల శిక్షణ తరగతుల్ని ఆదివారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, విజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు శిక్షణ తరగతులు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ఓపెన్ స్కూల్ పరీక్ష విధానంలో ప్రభుత్వం తెచ్చిన మార్పులతో మెటీరియల్ నేరుగా అభ్యర్థుల ఇళ్లకు పంపించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

ఫిరంగిపురం: ద్విచక్రవాహనంపై వెళుతున్న దంపతులను మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కిందపడి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం మండలకేంద్రంలోని వేములూరిపాడు గ్రామశివారు ఈద్గా సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చీరాలకు చెందిన బాలాజీ, మీరాబీలు కొండవీడు కోటను సందర్శించుకొని ద్విచక్రవాహనంపై వేములూరిపాడు వెళుతుండగా మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈసంఘటనలో వాహనంపై ఉన్న దంపతులు కిందపడి తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారిని స్థానికులు ఆటోలో చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు.

పిల్లల్లో పెరుగుతున్న మానసిక సమస్యలు



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కొసరాజు కళాధర్, డాక్టర్ భువనేశ్వరి దంపతులు

గుంటూరు మెడికల్: చిన్నారుల్లో నేడు మానసిక సమస్యలు పెరగడం చాలా బాధాకరమైన విషయమని సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ కొసరాజు కళాధర్ అన్నారు. స్థానిక సాంబశివపేటలో శనివారం పిల్లలు, స్త్రీల కోసం ప్రత్యేకంగా నూతనంగా నిర్మించిన 'పాథ్ వేస్ సైకాలజీ' మానసిక వైద్యశాలను డాక్టర్ కొసరాజు కళాధర్, డాక్టర్ భువనేశ్వరి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి వల్ల నేడు తల్లిదండ్రులు పిల్లలతో చాలా తక్కువ సమయం గడుపుతున్నారని చెప్పారు. పిల్లల చేతులకు ఫోన్లు అప్పగించి సొంత పనుల్లో మునిగి తేలడంతో సరిగా మాటలు పలకలేక పోవడంతో పాటు పలు రకాల మానసిక సమస్యల బారినపడుతున్నారని వెల్లడించారు. మానస హాస్పిటల్ అధినేత, మానసిక వైద్యనిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి.ఎల్. నరసింహారావు, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ ఇవటూరి శరత్‌చంద్ర మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన పాథ్ వేస్ సైకాలజీ మానసిక చికిత్సా కేంద్రంలో పిల్లల్లో వచ్చే వివిధ రకాల మానసిక సమస్యల్ని ముందస్తుగానే గుర్తించి చికిత్స అందించే ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పిల్లల చికిత్సలో ప్రత్యేక శిక్షణ పొందిన డాక్టర్ శ్రీరమ్య పర్యవేక్షణలో వైద్యసేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. స్త్రీల మానసిక రుగ్మతల కోసం ఉమెన్ వెల్‌నెస్ సెంటర్ కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. సీనియర్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ యస్.వి.రమణారావు, హైదరాబాద్ ఆషా హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ కె. చంద్రశేఖర్, డాక్టర్ జి. ప్రసాదరావు, ఖమ్మంకు చెందిన సైకియాట్రిస్ట్ డాక్టర్ ఆర్. సతీష్ బాబు, డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఏ. హనుమంతరావు , డాక్టర్ ఏ. శ్రీనివాసరావు పలు వైద్య విభాగాల్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ వైద్య నిపుణులు పాల్గొని డాక్టర్ శ్రీరమ్యను అభినందించారు.

నిత్యావసరాలు పంపిణీ

తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో స్థానిక యడ్ల లింగయ్య కాలనీ, కొలకలూరు, నందులపేట, కఠెవరం ప్రాంతాల్లో చిత్తు కాగితాలు ఏరుకుని జీవించే వేస్ట్ పికర్స్‌కు బియ్యం, కందిపప్పు, నూనె, చింతపండు, పంచదార తదితర నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో వారు పడుతున్న ఇబ్బందులను గమనించి దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సీఈవో అల్లాడి దేవకుమార్ మొత్తం 120 మందికి నిత్యావసరాలను అందించారు. స్థానిక న్యాయవాది కేసీ బసవయ్య, డీబీఆర్‌సీ ప్రతినిధి రాజశేఖర్, వెంకటరమణ పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం

తెనాలిఅర్బన్: వినియోగదారుల పరిరక్షణ చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని తెనాలి వినియోగదారుల సంఘ అధ్యక్షుడు ఆర్ఎస్.శంకర రావు పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణంలో ఏదైనా వస్తువు కొంటే తప్పని సరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. సంఘ కార్యదర్శి డీవీ సోమయ్య శాస్త్రి మాట్లాడుతూ వస్తువు కొనేముందు ఎక్స్‌పైరీ డేట్, ఎమ్మార్పీ గమనించాలన్నారు. అలాగే తూకం పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో శేఖర్ స్వామి, వినియోగదారులు పాల్గొన్నారు.